VC NEWS

# వేగుచుక్క

పీడిత ప్రజల గొంతుక...

TELUGU DAILY NEWS

www.veguchukkanews.com

నిజామాబాద్ సోమవారం 30 సెప్టెంబర్ 2024

వెల: రూ.3/- పేజీలు : 4 సంపుటి:02 సంచిక: 73




2లో

మిళనాట 'సన్' రైజ్.. డిప్యూటీ సీఎంగా ఉదయనిధి


PUBLISHED FROM HYDERABAD CIRCULATED BY RANGAREDDY, NALGONDA, KHAMMAM, KARIMNAGAR, WARANGAL, MAHABOOBNAGAR, MEDAK, NIZAMABAD, ADILABAD




# కూల్చివేతలపై వెనక్కి!

- ప్రజాగ్రహంతో పేదల ఇళ్ల జోలికి వెళ్లే విషయంలో ప్రభుత్వం పునరాలోచన
- దూకుడు తగ్గించి ఆచితూచి ముందుకెళ్లాలని భావిస్తున్న సర్కారు
- ప్రతిపక్షాల నిరసనలు, సొంత పార్టీలో ప్రతికూలత పరిగణనలోకి..
- రాజకీయంగా కోలుకోలేని దెబ్బ తగులుతుందనే అభిప్రాయం
- ప్రస్తుతానికి ఎఫ్‌టీఎల్, బఫర్‌జోన్ల వరకే పరిమితమయ్యే అవకాశం
- హైడ్రా గుర్తించిన వాణిజ్య భవనాలు,బడాబాబుల ఫామ్‌హౌస్‌లపై చర్యలు!
- సామాన్య, మధ్య తరగతి ప్రజల్లో వ్యతిరేకత పెరగకుండా జాగ్రత్తలు
- మూసీ నిర్వాసితులకు పునరావాసంపై విస్తృత ప్రచారానికి నిర్ణయం
- డబుల్ బెడ్ రూం ఇళ్లపై ప్రత్యేక కార్యాచరణ దిశగా అడుగులు

హైదరాబాద్: హైడ్రా కూల్చివేతలు, మూసీ ప్రక్షాళన విషయాల్లో తీవ్ర ప్రజాగ్రహం వ్యక్తమవుతోన్న నేపథ్యంలో రాష్ట్ర ప్రభుత్వం వెనకడుగు వేసే అవకాశాలు కనిపిస్తున్నాయి. రెడ్ మార్కింగ్ పేరుతో మూసీపై చేస్తున్న హడావుడిని ప్రస్తుతానికి నిలిపివేయాలని, దూకుడు తగ్గించాలని సర్కారు పెద్దలు భావిస్తున్నట్టు సమాచారం. మూసీ ప్రక్షాళన పేరుతో తమ ఇళ్లను కూల్చివేస్తున్నారని, హైడ్రా ఏర్పాటు చేసి పెద్దల జోలికి వెళ్లకుండా దశాబ్దాలుగా నివాసముంటున్న తమపై ప్రభుత్వం జులుం ప్రదర్శిస్తోందంటూ పేదలు ఎక్కడికక్కడ నిరసనలకు దిగుతుండటంతో జాగ్రత్త పడాలని నిర్ణయించినట్లు తెలిసింది. చెమటోడ్చి సంపాదించుకున్న నివాసాలను నేలమట్టం చేసి తమ బతుకులను ప్రభుత్వం రోడ్డుపైకి తెస్తోందనే భావన సామాన్య ప్రజల్లో క్రమంగా బలపడుతుండడంతో ఆచితూచి ముందుకెళ్లాలని భావిస్తున్నట్లు సమాచారం. ప్రతిపక్షాలు కూడా హైడ్రా, మూసీ విషయాల్లో ప్రభుత్వ వైఖరిని తప్పుబట్టడం, పేదలు..మధ్యతరగతి వారి ఇళ్ల కూల్చివేతలపై తీవ్ర నిరసన వ్యక్తం చేయడం, సొంత పార్టీలో సైతం కొంత ప్రతికూలత వ్యక్తమవుతున్న నేపథ్యంలో ప్రస్తుతానికి వెనక్కు తగ్గాలనే నిర్ణయానికి వచ్చినట్లు తెలిసింది. అన్ని కోణాలను బేరీజు వేసుకుంటూ ముందుకెళ్లాలని భావిస్తున్నట్టు సమాచారం. పేదలను ఒప్పించి, మెప్పించాకే..

మూసీ నదిపై ఉన్న ఆక్రమణల తొలగింపు రాజకీయంగా వివాదాస్పదయ్యే అవకాశాలు స్పష్టంగా కనిపిస్తున్నాయి. ఈ నేపథ్యంలో ప్రస్తుతానికి పేదల ఇళ్ల జోలికి వెళ్లకుండా జాగ్రత్త తీసుకోవాలని, ఒకవేళ వెళ్లాల్సి వస్తే వారితో మాట్లాడి పునరావాస ప్యాకేజీపై వారిని ఒప్పించి మెప్పించాలని, దీనిపై విస్తృత ప్రచారం చేయాలని, ఆ తర్వాతే అడుగులు ముందుకేయాలని ప్రభుత్వం భావిస్తోంది. ప్రస్తుతానికి చెరువుల ఆక్రమణలు, ఎఫ్‌టీఎల్, బఫర్‌జోన్ల వరకే కార్యాచరణను పరిమితం చేయాలని, హైడ్రా గుర్తించిన వాణిజ్య భవనాలు, బడాబాబుల ఫామ్‌హౌస్‌లపై చర్యలు తీసుకోవడం ద్వారా సామాన్య, మధ్య తరగతి ప్రజల్లో వ్యతిరేకత తీవ్రం కాకుండా జాగ్రత్తలు తీసుకోవాలనే నిర్ణయానికి వచ్చినట్టు సమాచారం. రుణాలపై బ్యాంకర్లతో సంప్రదింపులుమూసీ నిర్వాసితులకు కల్పించే పునరావాసంపై విస్తృత ప్రచారం చేయాలని అధికార కాంగ్రెస్ పార్టీ పెద్దలు కూడా అభిప్రాయపడుతున్నారు. ఈ విషయంలో హైదరాబాద్ నగరానికి చెందిన ఎమ్మెల్యేలు బాహాటంగానే మాట్లాడుతుండటం గమనార్హం. పేదల ఇళ్లు కూల్చాల్సి వస్తే వారికి డబుల్ బెడ్ రూం ఇళ్లు నిర్మించేందుకు ప్రత్యేక కార్యాచరణ చేపడతామని, పరిహార ప్యాకేజీని అమలు చేస్తామని, బ్యాంకర్లతో రుణాలిప్పిస్తామంటూ హామీ ఇవ్వాలని వారు సూచిస్తున్నారు. పీసీసీ కూడా దీనిపై ఒక నివేదిక ఇవ్వాలని భావిస్తోంది. వీటితో పాటు, ముఖ్యంగా పునరావాసంపై ప్రజల్లో విస్తృత ప్రచారం కల్పించకుండా ముందుకెళ్లడం మంచి కన్నా ఎక్కువగా చెడు చేస్తుందని, రాజకీయంగా కోలుకోలేని దెబ్బ తగులుతుందనే అభిప్రాయం సర్వత్రా వ్యక్తమవుతున్న నేపథ్యంలో దీనిపై ప్రత్యేక కార్యాచరణను ప్రభుత్వం రూపొందించనున్నట్లు తెలిసింది.



## హైడ్రా బాధితులతో బీఆర్ఎస్ బృందం

# ముఖాముఖి

హైదరాబాద్: హైడ్రా కూల్చివేతల ప్రాంతాల్లో బీఆర్ఎస్ బృందం ఆదివారం పర్యటించింది. బండ్లగూడ జాగీర్, హైదర్‌షాకోట్, గంధంగూడలో పర్యటించిన బీఆర్ఎస్ నేతలు.. మూసీ ప్రాంత వాసుల ధర్నాలో పాల్గొన్నారు. హడ్రా బాధితులతో మాజీ మంత్రులు హరీష్‌రావు, సబిత, తలసాని ముఖాముఖిగా మాట్లాడారు.తెలంగాణ భవన్ నుంచి క్షేత్రస్థాయి పర్యటనకు బీఆర్ఎస్ బృందం బయలు దేరింది. మాజీ మంత్రులు హరీష్ రావు, సబితా ఇంద్రారెడ్డి, మల్లారెడ్డి, గంగుల కమలాకర్, మహమ్మద్ హాలీ ఆధ్వర్యంలో బీఆర్ఎస్ బృందంలో ఎమ్మెల్యేలు, రాజశేఖర్ రెడ్డి, వివేక్ గౌడ్, కాలేరు వెంకటేష్ , మాధవరం కృష్ణారావు, సంజయ్, పాడి కౌశిక్ రెడ్డి ఉన్నారు.

ఈ సందర్భంగా హరీష్‌రావు మాట్లాడారు. తెలంగాణలో తుగ్లక్ పాలన సాగుతోందన్నారు. సీఎం రేవంత్ మూసీ సుందరీకరణ పేరిట రియల్ వ్యాపారం చేస్తున్నారు. ప్రజలకు ఇచ్చిన హామీలు నెరవేర్చాలని ఆయన డిమాండ్ చేశారు."పేదల ఇళ్లకు బీఆర్ఎస్ ఎమ్మెల్యేలం రక్షణ కవచంలా నిలబడతాం. పేదల ఇళ్లు కూల్చాలంటే ముందుగా మా ఎమ్మెల్యేలపై జేసీబీ, బుల్డోజర్లు వెళ్లాలి. దేశాన్ని కాపాడే సైనికులు సైతం తమ ఇంటిని కాపాడుకోలేకపోతున్నారు. కొడంగల్‌లో సర్వే నంబర్ 1138లో ముఖ్యమంత్రి ఇల్లే చెరువులో ఉంది. ముఖ్యమంత్రికి ఒక రూల్..

ఆయన సోదరుడికి ఒక రూల్.. గరీబోళ్లకు మరొక రూలా?. హైడ్రా బలిసినోళ్ల

కోసమే

పని చేస్తుంది. ఇందిరాగాంధీ పేదరికాన్ని పోగడతానంటే.. ఇందిరమ్మ రాజ్యంలో రేవంత్ పేదల బతుకులను కూల్చుతున్నాడు. బుల్డోజర్ రాజ్యం నడవదంటోన్న రాహుల్ గాంధీ సమాధానం చెప్పాలి" హరీష్‌రావు డిమాండ్ చేశారు.

## ఇందిరమ్మ రాజ్యమంటే ఇళ్లు కూల్చడమా?



హైదరాబాద్: తెలంగాణలో హైడ్రా పాపం కాంగ్రెస్‌కు తప్పకుండా తగులుతుందన్నారు కేంద్రమంత్రి బండి సంజయ్. ఇందిరమ్మ రాజ్యం అంటే పేదల ఇళ్లు కూల్చడమా? అంటూ ప్రశ్నించారు. అలాగే, ప్రభుత్వం ఇప్పుడికైనా హైడ్రాపై సమీక్ష చేయాలన్నారు.కేంద్రమంత్రి బండి సంజయ్ ఆదివారం మీడియాతో మాట్లాడుతూ.. కిషన్ రెడ్డి రాగానే హైడ్రాపై బీజేపీ కార్యాచరణ ప్రకటిస్తాం. పేదలకు బీజేపీ అండగా ఉంటుంది. ఒకటి లేదా రెండు రోజుల్లో పెద్ద ఎత్తున ఆందోళన చేపడతాం. బుల్డోజర్లు ముందుగా మామీద నుండి వెళ్లాలి. అప్పుడే పేదల ఇళ్ల వద్దకు బుల్డోజర్లు వెళ్తాయి. తెలంగాణలో హైడ్రా పాపం కాంగ్రెస్‌కు తగులుతుంది. ఎన్ని ఇబ్బందులు తలెత్తిన అధికారులతో మీడియా సమావేశం పెట్టి తప్పును కప్పి పుచ్చుకుంటున్నారు. ఇందిరా రాజ్యం అంటే పేదల ఇళ్ళు కూల్చడమా?. కాంగ్రెస్ ప్రభుత్వం ప్రజలకు చుక్కలు చూపిస్తోంది. భూమి పట్టాలు, లింకు డాక్యుమెంట్స్, గ్రామా పంచాయితీ అనుమతి ఉన్న వారి ఇళ్లను కూడా కూల్చివేస్తున్నారు. అందులో ఉన్న వాళ్లంతా పేదలే. హైడ్రా వల్ల ప్రభుత్వ ఆర్థిక పరిస్థితి కూడా దెబ్బతింది. ఇప్పటికైనా హైడ్రాపై ప్రభుత్వం సమీక్ష చేయాలి' అంటూ కామెంట్స్ చేశారు.మల్కాజిగిరి ఎంపీ ఈటల రాజేందర్ మాట్లాడుతూ.. రేవంత్ రెడ్డి హామీలు అమలు చేయలేక

మిగతా 2లో



## 'హైడ్రా' కూల్చివేతలు..మంత్రి శ్రీధర్‌బాబు కీలక ప్రకటన

హైదరాబాద్: ప్రజలను రెచ్చగొట్టేందుకు కొన్ని అవకాశవాద శక్తులు చాలా కష్టపడుతున్నాయని రాష్ట్ర ఐటీ, పరిశ్రమల శాఖ మంత్రి శ్రీధర్‌బాబు అన్నారు.అసెంబ్లీలోని సీఎల్పీ కార్యాలయంలో శ్రీధర్‌బాబు ఆదివారం(సెప్టెంబర్29) మీడియాతో మాట్లాడారు.'చెరువులు,జలాశయాల రక్షణ కోసం రాష్ట్ర ప్రభుత్వం పరితపిస్తోంది.మూసీ ఆక్రమణలో ఉన్న ప్రతీ ఒక్కరికీ ప్రత్యమ్నాయ సదుపాయం కల్పిస్తున్నాం.పేదలకు ఏ రోజూ కాంగ్రెస్ అన్యాయం చేయలేదు.చేయదు. ఇళ్లు కోల్పోయిన వారందరికీ 2013 చట్టప్రకారం నష్టపరిహారం అందజేస్తాం. హైడ్రాతో పేదవారికి ఎటువంటి ఇబ్బంది ఉండదు. మూసీ ఆక్రమణలో ఉన్న పేదలందరికీ డబుల్‌బెడ్ రూమ్ ఇల్లు ఇస్తామని సీఎం హామీ ఇచ్చారు.మూసీలో మంచి నీరు ప్రవహించాలని మేం ప్రయత్నం చేస్తున్నాం.నందనవనం ప్రాజెక్టు చేపట్టినపుడు ప్రత్యమ్నాయ ఏర్పాట్లు చేయలేకపోయారు.కానీ మేం ఈరోజు పేదలందరికీ పక్కా ఇల్లు ఇస్తున్నాం.పేదలను నిలబెట్టే సంస్కృతి కాంగ్రెస్‌ది. పడగొట్టే సంస్కృతి బీఆర్ఎస్‌ది. బీఆర్ఎస్‌ది బుల్డోజర్ పాలసీ. మల్లన్నసాగర్ వద్ద బుల్డోజర్‌లతో పేదలను ఇళ్లను కూల్చారు'అని శ్రీధర్‌బాబు విమర్శించారు.

# ప్రజల ఆస్తులు కాపాడడం ప్రభుత్వ బాధ్యత

హైదరాబాద్: ప్రజల ఆస్తులు కాపాడడం తమ బాధ్యతని, అందులో భాగంగానే తెలంగాణలో చెరువులను రక్షించేందుకు చర్యలు చేపట్టామని ఉపముఖ్యమంత్రి భట్టివిక్రమార్క తెలిపారు. అభివృద్ధి, స్వేచ్ఛకు ప్రాధాన్యమిస్తున్నామన్నారు. అమెరికా పర్యటనలో ఉన్న ఆయన ఆదివారం శాన్‌ఫ్రాన్సిస్కోలో నివసిస్తున్న తెలుగువారు మీట్ అండ్ గ్రీట్ అనే పేరుతో నిర్వహించిన సమావేశంలో పాల్గొన్నారు. సదరన్ కాలిఫోర్నియా తెలుగు కమ్యూనిటీ, స్థానిక కాన్సులేట్ జనరల్ సంయుక్తంగా ఈ కార్యక్రమం ఏర్పాటు చేశాయి. ఈ సందర్భంగా భట్టి మాట్లాడుతూ.. 'గతంలో ఫ్యూడల్ మనస్తత్వం గల నేతల చేతుల్లో బందీ అయిన తెలంగాణను పూర్తి స్వేచ్ఛాయుత రాష్ట్రంగా మార్చాం. ఎవరు ఏ భావజాలాన్నైనా వ్యక్తపరిచే వాతావరణం కల్పించాం. అమెరికాలో స్థిరపడిన మన వారి మేధస్సు తెలుగు రాష్ట్రాల అభివృద్ధికి ఉపయోగపడాలి. పెట్టుబడులతో ముందుకు రావాలి. హైదరాబాద్ అంటేనే కొండలు, చెరువులు, పార్కులు అనే పేరుండేది. అక్రమ నిర్మాణాలతో అవన్నీ కనుమరుగయ్యాయి. ఇటీవల విజయవాడ నగరం వరదలో చిక్కుకుపోయిన పరిస్థితులు హైదరాబాద్‌లోనూ ఏర్పడతాయి. నదీగర్భంలో నిర్మాణాలు చేపడుతున్నారు. వీటిని ఇప్పటికైనా ఆపకపోతే భవిష్యత్తు తరాలకు పెద్ద ప్రమాదం వాటిల్లుతుంది. పేదలను అడ్డంపెట్టి బిల్డర్లు వ్యాపారం చేస్తున్నారు. వందల చెరువులు కనపడకుండా పోయాయి. వాటిని రక్షించేందుకు చర్యలు చేపట్టాం. మూసీ నదిలో మంచినీటిని పారిస్తాం.

# తమిళనాడు 'సన్' రైజ్.. డిప్యూటీ సీఎంగా ఉదయనిధి

దిల్లీ:తమిళనాడు ముఖ్యమంత్రి ఎంకే స్టాలిన్ తనయుడు ఉదయనిధి స్టాలిన్ రాష్ట్ర ఉపముఖ్యమంత్రిగా ప్రమోట్ అయ్యారు. మంత్రివర్గ పునర్వ్యవస్థీకరణలో భాగంగా మొత్తం నలుగురు ఎమ్మెల్యేలు మంత్రులుగా ప్రమాణం చేశారు. మనీలాండరింగ్ కేసులో జైలుకు వెళ్లి, రెండు రోజుల క్రితం బెయిల్‌పై విడుదలైన మాజీ మంత్రి సెంథిల్ బాలాజీ కూడా మంత్రిగా ప్రమాణం చేసిన వారిలో ఉన్నారు.గోవి చెళియన్, ఎస్‌ఎం నాజర్, ఆర్.రాజేంద్రన్‌లు కూడా మంత్రులుగా ప్రమాణస్వీకారం చేశారు. సెంథిల్‌కు విద్యుత్, ఎక్సైజ్ శాఖ, చెళియన్‌కు విద్యాశాఖ, నాజర్‌కు మైనార్టీ వ్యవహారాలు, రాజేంద్రన్‌కు పర్యటక శాఖలను కేటాయించారు. పునర్వ్యవస్థీకరణ సాధారణమైనదే అయినప్పటికీ.. ఈసారి ఉదయనిధికి డిప్యూటీ సీఎంగా బాధ్యతలు అప్పగించడంతో ప్రాధాన్యం సంతరించుకుంది.ఇప్పటికే రాష్ట్ర మంత్రిగా కొనసాగుతున్న ఉదయనిధి ఆదివారం జరిగిన ప్రమాణ స్వీకార కార్యక్రమంలో మళ్లీ ప్రమాణం చేయలేదు. ప్రమాణ స్వీకారోత్సవానికి బయలుదేరేముందు మీడియాతో మాట్లాడిన ఆయన.. ఉపముఖ్యమంత్రి అనేది తనకు పదవి కాదని, ఓ పెద్ద బాధ్యతని అన్నారు. మరోవైపు ఉదయనిధికి డిప్యూటీ సీఎం బాధ్యతలు అప్పగించడంపై విపక్షాలు విమర్శలు గుప్పించాయి.విపక్షాల విమర్శలు..జూనియర్ స్టాలిన్‌ను



'యువరాజు'గా అభివర్ణించిన అన్నాడీఎంకే.. 2026 అసెంబ్లీ ఎన్నికలకు ముందు డీఎంకే పతనానికి ఇదో సూచిక అని విమర్శించింది. తమ కుటుంబం నుంచి ఎవరూ పార్టీలోకి రారంటూ 2021 ఎన్నికలకు ముందు స్టాలిన్ చెప్పారని గుర్తుచేసింది. ప్రజాస్వామ్యం పేరుతో కుటుంబ పాలన కొనసాగుతోందని, రాష్ట్రానికి ఇదో చీకటి రోజు అని విమర్శలు గుప్పించింది. కుటుంబ ప్రయోజనాలకు ప్రాధాన్యం ఇస్తూ రాష్ట్ర ప్రజలను మోసం చేస్తోందంటూ భాజపా కూడా విమర్శలు గుప్పించింది. కూటమిలో ఇతర పార్టీలు ఉన్నప్పటికీ.. వాటికి ప్రాధాన్యం కల్పించడం లేదని విమర్శించింది.సినిమా నుంచి డిప్యూటీ సీఎం..నవంబర్ 27, 1977లో జన్మించిన ఉదయనిధి స్టాలిన్.. డిగ్రీ పూర్తయిన తర్వాత సినిమా రంగంలో అడుగుపెట్టారు. ప్రొడ్యూసర్, డిస్ట్రిబ్యూటర్, నటుడిగా గుర్తింపు తెచ్చుకున్నారు. డీఎంకే తమిళ వార్తాపత్రిక 'మురసోలీ' బాధ్యతలు చూశారు. కొంతకాలానికి పార్టీ కార్యక్రమాలు చూసుకోవడం మొదలుపెట్టారు.2019లో డీఎంకే యువజన విభాగం కార్యదర్శిగా ఎన్నికయ్యారు. రాష్ట్రవ్యాప్తంగా పర్యటన చేస్తూ అనేక కార్యక్రమాల్లో పాల్గొన్నారు. 2021 అసెంబ్లీ ఎన్నికల సమయంలో ప్రచారానికి మరింత పదును పెంచిన ఆయన.. కేంద్రంపై విమర్శలు గుప్పించారు. 2024 లోక్‌సభ ఎన్నికల సమయంలో భాజపా నేతృత్వంలోని ఎన్డీయేని లక్ష్యంగా చేసుకొని '29 పైసా పీఎం' పేరుతో ప్రచారంలో దూసుకెళ్లారు.దివంగత కరుణానిధి తన కుమారుడు ఎంకే స్టాలిన్‌ను తొలుత డిప్యూటీ సీఎంగా చేసినట్లుగానే ఉదయనిధి కూడా ఉప ముఖ్యమంత్రి పదవి చేపట్టినట్లు విశ్లేషకులు

చెబుతున్నారు. అయితే, మూడు దశాబ్దాల పాటు రాజకీయ అనుభవం పొందిన (నాలుగుసార్లు ఎమ్మెల్యే, చెన్నై మేయర్) తర్వాత ఎంకే స్టాలిన్‌కు కీలక పదవి దక్కగా.. ఉదయనిధి మాత్రం అనతికాలంలోనే డిప్యూటీ సీఎం పగ్గాలు చేపట్టడం గమనార్హం.



# నాణ్యమైన పౌష్టికాహారం అందించాలి.

## - కలెక్టర్ రాజీవ్ గాంధీ హనుమంతు.

**వేగుచుక్క న్యూస్,నిజామాబాద్, సెప్టెంబర్ 29**

ప్రభుత్వ సంక్షేమ వసతి గృహాలు, రెసిడెన్షియల్ పాఠశాలల్లో విద్యార్థులకు నాణ్యమైన పౌష్టికాహారాన్ని అందించాలని కలెక్టర్ రాజీవ్ గాంధీ హనుమంతు అధికారులను ఆదేశించారు.



విద్యార్థులు చక్కగా చదువుకుని భవిష్యత్తులో ఉన్నత స్థాయిని అధిరోహించేలా హాస్టళ్లు, గురుకులాల్లో అన్ని వసతులతో కూడిన ఆహ్లాదకరమైన వాతావరణం అందుబాటులో ఉండేలా చూడాలన్నారు. ముప్కాల్ మండలం పోచంపాడ్ లోని ప్రభుత్వ రెసిడెన్షియల్ బాలుర పాఠశాలను ఆకస్మికంగా తనిఖీ చేసిన కలెక్టర్, విద్యార్థులతో కలిసి గురుకులంలోనే రాత్రి బస చేశారు. ఆదివారం వేకువజామున విద్యార్థుల రోల్-కాల్ ను పరిశీలించారు. విద్యార్థుల కోసం తెచ్చిన పాల నాణ్యతను కలెక్టర్ తనిఖీ చేశారు. శారీరక దృఢత్వం, ఆరోగ్య పరిరక్షణ కోసం జాగింగ్, వామప్ చేపించిన తీరును పరిశీలించారు. ఖోఖో ఆడేందుకు సిద్ధమైన విద్యార్థులను కలెక్టర్ పరిచయం చేసుకుని, వారి ఆటను ఆసక్తిగా తిలకించారు. విద్యార్థులకు పలు సదుపాయాలు లేకపోవడాన్ని గమనించిన కలెక్టర్, సంబంధిత రాష్ట్ర స్థాయి అధికారులతో మాట్లాడి వాటిని సమకూర్చేలా చూస్తానని హామీ ఇచ్చారు. పేద విద్యార్థుల అభ్యున్నతిని కాంక్షిస్తూ ప్రభుత్వం పెద్ద ఎత్తున నిధులు వెచ్చిస్తున్నందున విద్యార్థులకు నాణ్యమైన విద్య, పౌష్టికారాన్ని అందించాలని సూచించారు. కలెక్టర్ వెంట పాఠశాల ప్రిన్సిపాల్ సురేందర్, ఉపాధ్యాయులు ఉన్నారు.

# విద్యార్థులకు పోటీ పరీక్షలు ఎంతో ఉపయోగం.

## - తపాలా శాఖ నిజామాబాద్ సబ్ డివిజన్ సహాయ పర్యవేక్షకులు సుష్మితాబెనర్జీ.

**వేగుచుక్క న్యూస్, సిరికొండ, సెప్టెంబర్ 29:**

విద్యార్థులలో విషయ పరిజ్ఞానం పరీక్షించుకొనుటకు, అంతర్లీనంగా ఉన్నా ప్రతిభా సామర్థ్యాలను పోటీ పరీక్షలు వెలికితీస్తాయని తపాలా శాఖ నిజామాబాద్ సబ్ డివిజన్ సహాయ పర్యవేక్షకులు సుష్మితాబెనర్జీ పేర్కొన్నారు. కేంద్ర తపాలా శాఖ తరపున 'దీన్ దయాల్ స్పార్శ్ యోజన' రాష్ట్ర స్థాయి జనరల్ నాలెడ్జ్ పోటీ పరీక్షను ఆదివారం సత్యశోధక్ పాఠశాలలో నిర్వహించారు. ఈ సందర్భంగా విద్యార్థులనుద్దేశించి సుష్మితాబెనర్జీ మాట్లాడారు. పాఠశాల స్థాయిలో పోటీ పరీక్షలపై పట్టు ఉంటే ఉన్నత చదువులలో రాణించవచ్చని అన్నారు. తపాలా శాఖ పిలాటలి అకౌంట్ వున్న ఆరు నుండి తొమ్మిదవ తరగతి చదువుతున్న



విద్యార్థులకు ప్రతి సంవత్సరం పోటీ పరీక్షను నిర్వహించనున్నట్టు తెలిపారు. విద్యార్థులలో తపాలా శాఖ పైన అవగాహనా, స్టాంపుల సేకరణ అలవాటును పెంపొందించి, విజేతలైన విద్యార్థులకు ఉపకారవేతనాలు అందించి ప్రోత్సహిస్తుందన్నారు. ఈ పరీక్ష వలన విద్యార్థులకు పోటీతత్వం అలవడుతుందని, తద్వారా భవిష్యత్తులో ఉన్నత స్థాయిలో స్థిరపడుటకు అవకాశం ఉంటుందన్నారు. విద్యార్థులు తపాలా సంస్థ యొక్క ప్రయోజనాలను తెలుసుకొని సద్వినియోగం పరుచుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో పాఠశాల ప్రిన్సిపాల్ ఆర్. నర్సయ్య, నిజామాబాద్, ఇందల్వాయి, ధర్పల్లి, సబ్ పోస్ట్ మాస్టర్స్ నవీన్, సృజన్, నితిన్ రెడ్డి తపాలా శాఖ ప్రతినిధులు గోపాల్, లింగం, రవి, నరేందర్ పాఠశాల ఉపాధ్యాయులు గంగారెడ్డి, రాజు, శంకర్, రవి, శ్రీధర్, జీవన్ తదితరులు పాల్గొన్నారు.

# కార్మికులకు వేతనం రూ"26 వేలు ఇవ్వాలి.

## - బిఎల్ టీయూ రాష్ట్ర అధ్యక్షుడు దండి వెంకట్, కార్యదర్శి సిద్ది రాములు.




**వేగుచుక్క న్యూస్, నిజమాబాద్, సెప్టెంబర్ 29:**

రాష్ట్రంలో ఉన్న ఔట్ సోర్సింగ్ కార్మికులకు కనీస వేతనం రూ" 26 వేలు అమలు చేయాలనీ బిఎల్ టియు రాష్ట్ర అధ్యక్షులు దండి వెంకట్, రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఎస్. సిద్దిరాములు రాష్ట్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. జిల్లా కేంద్రంలోని శివాజీ నగర్ లోగల బహుళజన బీడీ కార్మిక సంఘం రాష్ట్ర కార్యాలయంలో ఆదివారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో వారు మాట్లాడారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అనుసరిస్తున్న బహుజన కార్మిక వ్యతిరేక విధానాల వల్ల కనీస వేతనాలు అమలు చేయడంలో వివక్ష చూపుతున్నాయని విమర్శించారు. కేంద్రంలో బీజేపీ అధికారంలోకి వచ్చాక గత పదకొండు సంవత్సరాలుగా కార్మిక వర్గానికి రక్షణ కవచంగా ఉన్న కార్మిక చట్టాలను నిర్వీర్యం చేసి బహుజన శ్రామిక వర్గాన్ని పెట్టుబడిదారులకు, కట్టు బానిసలుగా మార్చిందని ఆరోపించారు. అసంఘటిత రంగ కార్మికుల సంక్షేమ పథకాలు అమలు, ఔట్ సోర్సింగ్ కార్మికులకు కనీస వేతనం 26వేలు అమలు చేయాలని డిమాండ్ చేస్తూ అక్టోబర్ లో రాష్ట్రవ్యాప్తంగా ఆందోళనాలు నిర్వహించబోతున్నట్లుగా వెల్లడించారు. ఈ కార్యక్రమంలో బిఎల్ టీయూ జిల్లా ప్రధాన కార్యదర్శి మేకల రాజేందర్, జిల్లా ఉపాధ్యక్షులు సయ్యద్, నగర ప్రధాన కార్యదర్శి గంగా శంకర్, నగర ఉపాధ్యక్షులు విశ్వనాథ్ పాల్గొన్నారు.

# ఉపాధ్యాయులు "భావి భారత నిర్మాతలు".

**వేగుచుక్క న్యూస్, నిజామాబాద్, సెప్టెంబర్ 29:**

ఉపాధ్యాయులు భావి భారత నిర్మాతలని, విద్యార్థులను తీర్చిదిద్ది, వారి బంగారు భవిష్యత్తుకు బాటలు వేస్తున్న టీచర్ల సేవలు గొప్పవని నిజామాబాద్ రూరల్ ఎమ్మెల్యే భూపతి రెడ్డి, అర్బన్ ఎమ్మెల్యే దన్ పాల్ సూర్య నారాయణ గుప్త అన్నారు. తెలంగాణ రికగ్నైజేడ్ స్కూల్ మేనేజ్మెంట్ అసోసియేషన్ (ట్రస్మా) జిల్లా కమిటీ ఆధ్వర్యంలో ఆదివారం బృందావన్ గార్డెన్ లో గురుపూజోత్సవం కార్యక్రమం ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా ఎమ్మెల్యేలు హాజరయ్యారు. ఈ సందర్భంగా ముందుగా ఎమ్మెల్యే భూపతి రెడ్డి మాట్లాడుతూ, ప్రైవేట్ పాఠశాలల్లోని టీచర్లు విద్యార్థులకు మంచి విద్యాబుద్దులు నేర్పుతూ, ఆదర్శంగా నిలుస్తున్నారని అన్నారు. ఉపాధ్యాయుల వల్లనే విద్యార్థులు వివిధ రంగాలలో రాణిస్తున్నారని, ఉపాధ్యాయులు లేని సమాజం ఊహించలేమని అన్నారు. ఉపాధ్యాయుడు కొవ్వొత్తిల కరిగిపోతూ విద్యార్థుల భవిష్యత్తును తీర్చిదిద్దుతాడని, విద్యార్థి ఎదుగుతుంటే చూసి మురిసిపోతాడని అన్నారు. అందుకే సమాజంలో ఉపాధ్యాయులకు వారికంటూ ప్రత్యేక స్థానం ఉందన్నారు. ప్రైవేట్ పాఠశాలల్లోని ఉపాధ్యాయులకు హెల్త్ కార్డులు అందించే విషయం ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్తానని భూపతి రెడ్డి అన్నారు.










**ఎమ్మెల్యేలు భూపతి రెడ్డి, దన్ పాల్ సూర్య నారాయణ.**

**ప్రైవేట్ పాఠశాలల్లోని టీచర్ల సేవలు గొప్పవని ప్రశంషలు.**

**ట్రస్మా ఆధ్వర్యంలో ఘనంగా గురుపూజోత్సవం.**

**250 మంది ఉపాధ్యాయులకు సన్మానం.**

అర్బన్ ఎమ్మెల్యే దన్ పాల్ మాట్లాడుతూ, విద్యార్థుల భవిష్యత్తు గురువులపైనే ఆధారపడి ఉందన్నారు. జాతీయతా భావం పెంపొందించే విధంగా విద్యార్థులను తీర్చిదిద్దాలని కోరారు. ఉర్దూ అకాడమీ చైర్మన్ తాహెర్ బిన్ హుందాన్ మాట్లాడుతూ, ప్రభుత్వం ప్రభుత్వ పాఠశాలలతో పాటు ప్రైవేటు పాఠశాలలకు ప్రభుత్వం అండగా ఉంటుందన్నారు. అనంతరం జిల్లావ్యాప్తంగా 250 ప్రైవేటు పాఠశాలల నుంచి వచ్చిన 250 మంది ఉత్తమ ఉపాధ్యాయులను ఘనంగా సన్మానించారు.

ఈ కార్యక్రమంలో డీఈఓ దుర్గా ప్రసాద్, ట్రస్మా రాష్ట్ర అధ్యక్షుడు మధుసూదన్, ప్రధాన కార్యదర్శి రమేష్ రావు, ప్రతినిధులు యాదగిరి శేఖర్ రావు, రాఘవేంద్ర రెడ్డి, స్పోక్స్ పర్సన్ జయసింహ గౌడ్, స్టేట్ వర్కింగ్ ప్రెసిడెంట్ శివరాత్రి యాదగిరి, జిల్లా అధ్యక్షుడు నిత్యానంద్, కార్యదర్శి అరుణ్, మధు, నరసింహారావు, తదితరులు పాల్గొన్నారు.

# ఇందిరమ్మ రాజ్యమంటే ఇళ్లు కూల్చడమా?

పిల్లి గంతులు వేస్తున్నారు. బ్యాంకులు 73 లక్షల మందికి రుణాలు ఇచ్చామని చెబుతున్నారు.. 48 లక్షల మందికి అని రేవంత్ రెడ్డి చెప్పారు. 35 నుంచి 40 శాతం మంది రైతులకు మాత్రమే రుణమాఫీ అయ్యింది. మేడ్చల్‌లో ఓ రైతు ఆత్మహత్య చేసుకున్నారు. రైతులకు ఇచ్చిన హామీలు అమలు చేయాలని డిమాండ్ చేస్తూ రేపు బీజేపీ దీక్ష చేపట్టింది. అప్పులపాలై రుణమాఫీ కానీ రైతులందరూ రైతు దీక్షకు హాజరై విజయవంతం చేయాలి. రైతు బంధు, రైతు బీమా, రైతు బోనస్ వస్తాయనే నమ్మకం లేకుండా పోయింది. రేవంత్ వాలకం చూస్తుంటే ఇచ్చిన హామీలు అమలు చేసే పరిస్థితి కనిపించడం లేదు. రేవంత్ రెడ్డి మెడలు వంచడానికి కలిసికట్టుగా పోరాటం చేద్దాంబీజేఎల్పీ నేత మహేశ్వర్ రెడ్డి.. రేపు ధర్నా చౌక్‌లో రైతు దీక్ష చేపడుతున్నాం. రైతులకు ఇచ్చిన హామీలను కాంగ్రెస్ ప్రభుత్వం విస్మరించింది. కాంగ్రెస్ ప్రభుత్వం ఇచ్చిన హామీలను అమలు చేయాలని డిమాండ్ చేస్తూ దీక్ష చేస్తున్నాం.